
వంశీ
రంగులరాట్నం

# రంగులరాట్నం

వంశీ

సాహితి

# రంగులరాట్నం

**వంశీ**

ప్రథమ ముద్రణ : జనవరి, 2016

మూల్యం : రూ. **75/-**

ప్రచురణ కర్త :

**సాహితి ప్రచురణలు**

29-13-53, కాళేశ్వరరావు రోడ్డు,

సూర్యారావుపేట, విజయవాడ - 520 002

ఫోన్ : 0866-2436642/43, 8121098500

**e-mail : sahithi.vja@gmail.com**



అంకితం

ఎక్కడ ఏ మంచి కథ కనిపించినా
చాలా ఇష్టంతో చదివే నాకిష్టమైన
మిత్రులు కిరణ్ గారికి

— వంశీ

# వంశీ

## ఇతర రచనలు




₹ : 300/-



₹ : 300/-




| | |
|---|---|
| వెండితెర నవలలు | 100.00 |
| గాలికొండపురం రైల్వేగేటు | 70.00 |
| మహల్లో కోకిల | 70.00 |
| గోకులంలో రాధ | 70.00 |
| రవ్వలకొండ | 60.00 |
| వెన్నెలబొమ్మ | 50.00 |
| మంచుపల్లకి | 50.00 |

ఎక్కడ చూసినా జనం.

అద్దరిపడవల్లోంచి ఇద్దరిరేవులోకి దిగే జనం.

ఇద్దరిపడవలెక్కి అద్దరిఒడ్డుకెళ్ళే జనం.ఆ ముక్తేశ్వరం రేవులో వున్న చాలా పడవల్లో ఒక ఇంజను పడవనిండా రకరకాల జనం.

ముక్కవాసన, ముతకవాసన, చుట్టల వాసన, కొత్తబట్టల వాసనలన్నీ కలగలిపివస్తున్నాయి. రకరకాల అరుపులు, మాటలు, పాటలు, తిట్లు పొగడ్తల్తో గందరగోళంగా వుంది. వాళ్ళలో పడవ మధ్యలో ఉన్న పన్నామీద కూర్చున్న వేదవతికి వయసు అరవయ్యేళ్ళు పైనుంటుంది.

కాస్సేపటికి కదిలిన ఆ పడవ గోదావరి మధ్యలోకెళ్ళాక పూసపాటివారి లంక అంచున ఆగిపోయింది. అదేగాదు వచ్చేపోయే పడవలన్నీ అక్కడాగి పోతున్నాయి. కిందికి దిగి ఆ లంకలో కొంతదూరం నడిస్తే లంక అవతలి అంచు వస్తుంది. అక్కడ మళ్ళీ వచ్చేపోయే పడవలు. టిక్కెట్టు పాకలోకెళ్ళి కోటిపల్లి రేవుకి టిక్కెట్టు కొనుక్కుని మళ్ళీ పడవెక్కాలి.

దిగిన జనంతోపాటు లంకలో నడుస్తుంది వేదవతి. వచ్చీపోయే జనం వందల లెక్కలో వున్నారు.

వెళ్తున్న జనాల ముఖాల్లో కళ, తిరిగొస్తున్నవాళ్ళలో నీరసం కొట్టొచ్చినట్టు కనబడ్తున్నాయి.

చాలాదూరం నడిచి లంకలో ఈ పక్కకొచ్చి టిక్కెట్లు కొనుక్కొని రాబోయే పడవకోసం చూస్తున్నారు. జనాన్నెక్కించుకుని వెళ్ళే పడవలెళ్తున్నాయి. వచ్చేవి వస్తున్నాయి. వీళ్ళు ఎక్కాల్సిందింకా రాలేదు.

కాస్త దూరంగా జనంతో నిండిపోయున్న కోటిపల్లి రేవూ, ఊరూ అందంగా కనిపిస్తున్నాయి.

నిలబడున్న జనం పక్కనించే నీళ్ళలోకి దిగిన కొందరు జాలరి కుర్రోళ్ళు రొయ్యలకోసం నూకలు జల్లి ఆనవాలుగా సన్నటి రెల్లుదుబ్బుమొక్కలు గుచ్చుతున్నారు. పదిరోజుల గుండుతో ఉన్న ఆ మనిషి నుదుట విభూతిబొట్లు, మధ్యలో పెద్ద కుంకంబొట్టూ వున్నాయి. భార్యా, నలుగురు పిల్లలూ అతనిచుట్టూ మూగున్నారు. ఆ శివరాత్రి రోజు కోటిపల్లిలో దేవుడి దర్శనం చేసుకొని అన్నవరం వెళ్తారంట వాళ్ళు.

భక్తుడైన ఆ గుండుమనిషి దోసిటతో గోదావరి నీళ్ళు తీసుకొని భార్యాపిల్లల తలలమీద జల్లుతుంటే "చలి...చలి"అని అరుస్తున్నారు వాళ్ళు.

"నోర్మూయ్యండి. దేవతలు తెల్లవారుఝామునే ఈ కోటిపల్లిరేవులోకొచ్చి స్నానాలాడిగానీ వెనక్కి మళ్ళరు. అంత పవిత్రమైన జలమిది తెల్సా?" అంటున్నాడు.

కాస్సేపటికి ముప్పైహార్స్‌పవర్ ఇంజను పడవొచ్చింది. పడవమీంచి వాలుగా ఒడ్డుకి నేరేడు బల్లవేశాడు సరంగు. గెడేసే నాగన్న ఒడ్డుమీదున్న మోటారు సైకిళ్ళనీ, సాదాసైకిళ్ళనీ పడవలోకెక్కించి బండికి మూడురూపాయలు చొప్పున వసూలు చేస్తున్నాడు.

పడవెళ్ళిపోద్దని పంపర పనసకాయల బుట్ట గట్టిన సైకిలు తొక్కుకుంటా వచ్చిన ఆ మనిషితో "బుట్ట విప్పందే సైకిల్ని పడవలోకెక్కించుకోను" అని కండిషను పెడ్తున్నాడు నాగన్న. జనవంతా ఆ పడవ అడ్డపట్టామీదా, ఒంగులమీదా, ఎడాపెడావున్న పడిచెక్కల మీదా అలా ఎక్కడబడితే అక్కడ సర్దేసుకుంటుండగా బుట్టోడు పడవాపమని ఒకటే గోల.

గోదాట్లో నీళ్ళని కోసుకుంటా పెద్దచప్పుళ్ళు చేసుకుంటా ముందు కెళ్తుందా ఇంజను పడవ.

జనం మధ్యలో ఉన్న వేదవతి ఎవ్వరితోనూ మాటాడ్డం లేదు. దగ్గర పడ్తున్న ఆ కోటిపల్లి రేవుకేసి, తీర్థం జనంతో కిక్కిరిసిపోయున్న ఆ కోటిపల్లి వూరికేసి చూస్తుందా లంకలపల్లి జమిందారిణి.

అలా చూస్తున్న ఆమెకి చిరుచెమటలు పడ్తున్నాయి. ఆమె ముసలి గుండెలు లబలబమంటూ కొట్టుకుంటున్నాయి. ఆమె నోరెండిపోతోంది. రేవులో ఆగిన పడవలో జనంతోపాటు దిగుతుంది.

ఎక్కడెక్కడినించో వచ్చి పావంచాల రేవులో స్నానాలు చేస్తున్న జనం. మంత్రాలు చదూతున్న బ్రాహ్మలు.

కాఫీ హోటళ్ళనిండా జనం. ఆ హోటలు పాకల ముందు పెసరట్ల పొయ్యిలు, కిళ్లీకొట్ల స్పీకర్లలోంచి వినిపిస్తున్న రకరకాల పాటలు, అగరవత్తులు, కొబ్బరికాయలూ, అరటిపళ్ళు అమ్మే దుకాణాలు, బుడగలూ, చిన్నపిల్లల కళ్ళజోళ్ళు స్టాండుకి తగిలించుకు అమ్మేవాడు, పీచుమిఠాయి డబ్బా మూతకున్న రింగు తాలూకు గళగళమోత. ఒకటే సందడిగా ఉంది.

ఎవర్నో వెతుక్కుంటా నడుస్తున్న వేదవతి రంగుల రాట్నం దగ్గరకొచ్చింది.

వాళ్ళమధ్యలో ఉన్న తెల్లటి చేతుల బనియన్ వేసుకున్న ఎనభయ్యేళ్ళ పట్టాల సోమరాజు జనందగ్గర డబ్బులు వసూలుచేస్తున్నాడు. ఆ రాట్నం దగ్గరకొచ్చి నిలబడింది వేదవతి. పల్చగా వున్న జనందగ్గర డబ్బులు తీసుకొని సీట్లలో ఎక్కించడంలో చాలా బిజీగా వున్నాడు పండుముసలి పట్టాల సోమరాజు.

మెల్లగా నోరు విప్పిన వేదవతి "బాబూ ఇక్కడ..." అని పూర్తిచేసేలోపే "ఎళ్ళండమ్మా మీలాగ వయసైపోయినోళ్ళని రంగులరాట్నవెక్కించం" అన్నాడు.

కాస్త కంగారుపడతా ఆ ముసలి సోమరాజునే కాస్సేపు చూసిన ఆ లంకలపల్లి జమీందారిణి వాడ్రేవు వేదవతి– "అది కాదు బాబూ. శాస్త్రిగారు" అంది.

"మా రాట్నం ఎక్కేవోళ్ళ ఫేసులే గుర్తుండవు. ఇంక పేర్లేం గుర్తుపెట్టుకుంటాం జెప్పండి. వెళ్ళండి తల్లీ" అన్నాడు సోమరాజు మనవడైన రామరాజు.

"బాబూ...నేను మేడారపు సూరయ్యశాస్త్రిగారిని కలవడానికి ప్రతి ఏడూ వస్తున్నాను"

మెడకాయ గిరుక్కున తిప్పిన పండుముసలి సోమరాజు "అమ్మా... తమరా... బాగున్నారండీ" అన్నాడు.

"ఆ...పర్లేదు. శాస్త్రిగారు రాలేదా?" అంది వేదవతి.

"ఆరింకా వచ్చినట్టు లేదు తల్లీ! అయినా ఎందుకమ్మా, ప్రతి ఏడూ వస్తారు...రాని ఆ శాస్త్రులుగార్నడుగుతారు" అన్నాడు ముసలి సోమరాజు.

చప్పుడు లేని గుండ్రటి చంద్రుళ్ళా నవ్వేసిన ఆ జమీందారిణి "ఈ కోటిపల్లి తీర్థం ఏడాదికోసారిగాకుండా వారానికోసారి వస్తే బావుణ్ణు అనిపిస్తుంది" అంది.

"ఎందుకమ్మా?" అన్నాడు పట్టాల సోమరాజు.

"ఇంకా నేను బతికేది కొన్నివారాలే గాబట్టి సోమరాజూ" అంది లంకలపల్లి జమీందారిణి. అలొచ్చి వలని కుదిపినట్టు కదిలిపోతా కంగారు పడిపోయిన ఆ పట్టాల సోమరాజు కాస్సేపటికి "ఇంత కష్టంలో కూడా ఆయన్ని కలవాల్సిన అవసరమేంటమ్మగారూ" అన్నాడు.

బుద్ధపౌర్ణమి నాటి చంద్రుళ్ళాంటి తెల్లటి ముఖంగల ఆ లంకలపల్లి జమిందారయిన వాడ్రేవు రత్నేశ్వర్రావుగారి భార్య వేదవతి చాలా నీరసంగా "చనిపోయేముందు ఏమైనా కోరికలుంటే మళ్ళీ పుడతారంట కదా! నాకు మళ్ళీ జన్మ ఉండకూడదని, నేను మళ్ళీ పుట్టకూడదనీ" అంది.

"ఈ వయసులో తమకున్న కోరికేంటి తల్లీ?"

"ఒక రహస్యం గురించి. ఆ మేడారపు సూరయ్యశాస్త్రిగారొస్తే కాస్త కూర్చోబెట్టు... నేను గుళ్ళోకెళ్ళి దర్శనం చేసుకొస్తాను" అంటా నీరసంగా గోదాట్లో పడవెళ్ళాక వెనక్కి తిరిగెళ్ళే మెల్లమెల్లటి అలలాగ ఆమె వెళ్ళిపోతుంటే 'ఈవిడకీ, ఆ శాస్త్రిగారికీ మధ్య సంబంధమేంటో' అనుకుంటా ఆలోచించడం మొదలుపెట్టాడు.

ఈలోగా ఆ పండుముసలి పట్టాల సోమరాజు దగ్గరకొచ్చిన మనుమడు రామరాజు "ఎందుకురా తాతా ఈ ముసలావిడ ప్రతి ఏడూ వస్తుంది?" అన్నాడు.

"ఆవిడ లంకలపల్లి బ్రాహ్మణ జమీందారు వాడ్రేవు రత్నేశ్వర్రావుగారి భార్య. అద్దరినుంచి రావాల్సిన శాస్త్రిగారికోసంరా మనవడా" అన్నాడు సోమరాజు.

"పనేంటో" అన్నాడు పట్టాల రామరాజు.

"అడిగితే చాలా రహస్యం. చెప్పనందిరా" అన్నాడు పండుముసలి పట్టాల సోమరాజు.

"అప్పుడా శాస్త్రిగారి ఊరే వెళ్ళొచ్చుగదా?" అన్నాడు పట్టాల రామరాజు.

"ఆయన ఊరి పేరు తెలిస్తే నువ్వన్నట్టే జేసేది" అంటా ఆ రోజు న్యూస్ పేపరు మడత పెట్టుకుని రావిచెట్టు చప్టావేపు నడిచాడు ముసలి సోమరాజు.

❖ ❖ ❖

"ఓన్లీ ఫైవ్ డేస్. సరిగ్గా అయిదే అయిదురోజులు షూటింగ్ ఉంటుంది సార్..." అంటూ వాళ్ళ ఛానెల్ ఆఫీసులో వున్న క్రియేటివ్ హెడ్‌తో మాటాడుతున్నాడు డాక్యుమెంటరీ డైరెక్టర్ జయకృష్ణ.

"గోల చెయ్యకు డాళింగ్. రెండు రోజుల్లో బయలుదేరుతున్నానుగదా" అని తన ఫియాన్సీతో అంటుంది అసిస్టెంట్ డైరెక్టర్ సునందిని.

"కార్తిక్ స్కూల్ వేన్ టైముకొస్తుందా? మీ జ్వరమెలాగుంది?" భర్తని అడుగుతుంది ఏంకర్ సరస్వతి.

"సినిమా వచ్చింది. టీవీలకి చెయ్యడం మానేస్తాను బాస్" ఫ్రెండ్‌కి చెప్తున్నాడు కెమెరామేన్ గోవింద్.

"నాసిక్‌లో షూటింగ్ జరుగుతున్నప్పుడు నా సీకోనిక్ ఎక్స్‌పోజర్ మీటర్ నీళ్ళలో పడిపోయిందిరా అన్నాయ్... కిరణ్మయి నా పక్కనే వుంది. మాటాడ్తావా" అన్న కెమెరా అసిస్టెంట్ విజ్జి (విజయలక్ష్మి) "మా అన్నయ్య నీతో మాటాడతాడంట" అంటా తన పక్కనే ఉన్న ఇంకో కెమెరా అసిస్టెంట్ కిరణ్మయికిచ్చింది ఫోన్.

"ఏరా భాస్కరం! కోటిపల్లి గోదాట్లో నీళ్ళు ఉప్పగా వుంటాయా, చప్పగా వుంటాయా" కాకినాడ సాలిపేటలో ఉన్న మెడికల్ షాపు ఫ్రెండ్‌ని అడుగుతున్నాడు స్క్రిప్ట్‌రైటర్ అనంతవిశ్వం.

"అబ్బ, ఇరవై రోజులనుంచి షూటింగ్ చేసిచేసి ఒళ్ళంతా హూనం హూనమైపోయింది. ఎప్పుడు హైదరాబాదు వచ్చేద్దామా అనుందే" భార్యకి బాధలు చెప్పుకుంటున్నాడు మేనేజర్ అంజిబాబు.

"మందు మానేసి మూడ్నెల్లయ్యిందన్నా...ఇక తాక్కూడదని కూడా డిసైడు జేసినా... అందుకే నిన్ను గల్వట్లేదన్నా" ఫ్రెండ్‌తో అంటున్నాడు డ్రైవర్ మల్లేశ్.

సంపద A CULTURE T.V అని ఎడాపెడా వెనకాముందూ రాసున్న ఆ బెడ్‌ఫోర్డ్ వేన్‌లో ఉన్న ఆ పదిమంది జనం ఫోన్లలో మాటాడ్తానే, ఏటిగట్టు కుడిపక్కనున్న గోదావరినీ, ఎడంపక్కనున్న ప్రకృతినీ చూస్తున్నారు. గుర్రపు డెక్కతో నిండిపోయివున్న పసిరినీళ్ళ చెరువు అది. దాంట్లో గేలం వేసిన ఒక కుర్రాడు చేపలు తగుల్తాయని ఓపిగ్గా నిలబడున్నాడు.

ప్రభువు ముందు ప్రార్ధన చేసిన నూనెని ఎవరింట్లోనో ఇవ్వడానికి మోపెడ్ మీదెళ్ళిపోతున్నాడో చర్చి ఫాదర్.

మేకల గుంపుని తోల్తా నడుస్తున్న మనిషి వాటి మధ్యలోనే కర్రపట్టుకుని నడుస్తున్నాడు. మొన్న పుట్టిన తెల్లమేకపిల్లమట్టుకు వాడి మెడలమీద కూర్చునుంది.

అల్లనేరేడు చెట్టుకొమ్మల్లోపల తల్లకిందులుగా వేలాడిన గబ్బిలాలు కీకర భీకరమంటా గోలచేస్తున్నాయి.

కోటిపల్లి తీర్థానికెళ్ళి తిరిగొస్తున్న ఆడాళ్ళగుంపు పుంతల్లోంచి వాళ్ళ కొంపల్లోకెళ్ళిపోతుంది.

సంపద అనే ఆ శాటిలైట్ టీవీ ఛానెల్ వేన్ గోదావరి గట్టున జనంతో నిండిపోయివున్న ఆ కోటిపల్లి తీర్థంలో కొచ్చింది. కోలంకనించొచ్చిన జీళ్ళ దుకాణం సత్యవతి, యండమూరునించొచ్చి ఖర్జూరం కొట్టు పెట్టిన చిట్టిబాబు, కొంకుదురునించొచ్చి మిఠాయికొట్టు పెట్టిన వీరాస్వామి, చికెన్ పకోడీలేసే గంగవరం సత్తార్ ఫేమిలీ, రెడీమేడ్ బట్టల దుకాణం పెట్టిన రాజమండ్రి సాంబమూర్తి – వాళ్ళందర్నీ ఏంకర్ సరస్వతి ఇంటర్వ్యూ చేస్తుంటే, కెమెరా భుజంమీద పెట్టుకుని షూట్‌చేస్తున్నాడు కెమెరామేన్ గోవింద్.

మేనేజర్ అంజిబాబుకి తీర్థంలో తగిలిన పిల్లిరావుడు ఆ రద్దీలో తోసుకుంటానే ఛాయా సోమేశ్వరుడిగుడిలోకి తీసుకెళ్ళి దర్శనంచేయించాడు వాళ్ళకి.

ఆ తర్వాత గుడిముందున్న సోమగుండాన్ని చూపించాడు. గుడిపక్కన ఆనాటి పూసపాటి రాజావారి వసతిగృహాన్నీ, చెరువుగట్టుమీద శిథిలమై పోయివున్న రాణిగారి వసతిగృహాన్ని చూపిస్తుంటే, వాటిని షూట్‌చేస్తున్నాడు గోవింద్. గుడివెనక పడమర, ఉత్తరాల్లో ఉన్న బ్రాహ్మణ అగ్రహారంలోకి తీసుకెళ్తుంటే వెనక హుషారుగా నడుస్తుంది సంపద టీవీ టీమ్.

నాళంవారి అన్నదానసత్రం, బచ్చువారి సత్రం, పట్నాలవారి సత్రం చూపించి " ఈ సత్రాల్లో ఎవరి కులంవారికి వాళ్ళు భోజనాలు పెడతారు. పైండావారి సత్రంలో మట్టుకు అన్ని కులాలవారికీ పెడతారు భోజనాలు" అంటూ చెప్పుకుంటాపోతున్నాడు.

"గత వైభవానికి గుర్తుగా ఇప్పటికీ ఈ కోటిపల్లిలో ఏమైనా వున్నాయా?" అంది ఏంకర్ సరస్వతి.

సైకిలు టైరు బరస్టయినట్టు నవ్వేసిన పిల్లిరావుడు "మీరు భళేవోరే. పావంచాల రేవులో ఉన్న రావిచెట్టుకి ఎంత చరిత్రుందో తెల్సాండీ?" అన్నాడు.

రకరకాల యాంగిల్స్‌లో ఆ ముసలి రావిచెట్టునీ, దానిచుట్టూ కట్టిన సిమెంటు చప్టానీ షూట్ చేస్తున్నాడు గోవింద్. ఛానెల్ లోగో బిగించివున్న మైక్ పట్టుకుని ఆన్ అయిన కెమెరా ముందు నిలబడ్డ సరస్వతి, ఆ చెట్టు చరిత్రంతా చాలా గొప్పగా చెప్తుంది. చప్టామీద పడుకున్న సోమరాజు లేచి ఓసారి వాళ్ళని చూసి, పక్కకి జారిన తుండుగుడ్డచుట్టని తల మధ్యకి సర్దుకుని మళ్ళీ పడుకున్నాడు.

రావిచెట్టుని షూట్ చెయ్యడం అయ్యేక గోదావరినీళ్ళలో దిగిన గోవింద్, రేవులో ఆగుతున్న పడవల్నీ, దాంట్లోంచి దిగుతున్న జనాన్నీ షూట్ చేస్తున్నాడు.

కిరణ్మయి, విజ్జీ వాళ్ళ చేతుల్లో ఉన్న బేబీ రిఫ్లెక్టర్స్‌ని జనానికి సెంటర్ చేస్తున్నారు. కాస్సేపటికి టీమంతా గోదారి నీళ్ళల్లోకి దిగిపోయింది.

మెడదాకా మునిగిన ఏంకర్ సరస్వతి మైక్‌పట్టుకుని ఈ తీర్థానికి అద్దరినించొచ్చే జనం గురించి మాటాడ్తుంది.

నీళ్ళల్లోకి దిగి, వాళ్ళ మధ్యలోకొచ్చిన పిల్లిరావుడు "సార్‌గారూ! ఈ పావంచాల రేవుకి కుడిపక్కన తిరుగుతున్న ఆ రంగులరాట్నాన్ని చూశారా" అన్నాడు.

"చూశాను" అన్నాడు జయకృష్ణ.

"అయిదుతరాల వెనకదండీ ఆ రంగులరాట్నం. వాళ్ళని కదలేస్తే మీకు కావలసిన కథలు చాలా దొరుకుతాయండి" అని పిల్లిరావుడనడంతో అంతా నీళ్ళల్లోంచి ఒడ్డెక్కి ఆ రాట్నందగ్గరికి పరుగెట్టారు.

చెల్లూరు అనే ఊర్నుంచి వచ్చి చాలా తరాల్నుంచి రంగులరాట్నం వేస్తున్న పట్టాల వంశంలో అయిదోతరంవాడైన రామరాజు వాళ్ళ కుటుంబంలో జనంతో రాట్నం తిప్పుతా హడావుడిగా వున్నాడు. నెంబరేసిన క్లాప్‌బోర్డు కెమేరాకి చూపించింది సునందిని. రాట్నం దిగి రామరాజుకి డబ్బులిస్తున్న జనాన్ని షూట్ చేస్తున్నాడు గోవింద్...చెప్పుకుపోతుంది సరస్వతి.

రాట్నవెక్కడానికి అప్పుడొకడూ అప్పుడొకడూ చాలా పలుచగా వస్తున్నారు జనం. "పూర్వమెలాగుండేది! మారిపోయింది కాలం" అనుకుంటా ఆ జనాన్ని చూస్తున్న రామరాజు చుట్టూ చేరిపోయింది సంపద టీవి టీమ్. వాళ్ళని చూసిన రామరాజు "ఏంటండీ" అన్నాడు.

"మేం...సంపద...అనే కల్చర్ టీవీ ఛానెల్ మనుషులం. గోదావరి పుట్టిన త్రయంబకం నుంచి బయల్దేరి నాసిక్ వచ్చాం. అక్కడ్నించి కొంతదూరం నేలమీదా, ఆ తర్వాత నీళ్ళమీదా ప్రయాణం చేస్తా షిరిడీ అవతల గోదావరిలోకొచ్చాం.

బాసర, అదిలాబాద్, భద్రాచలంమీదుగా రాజమండ్రి వచ్చాం. అక్కడ్నించి మూలస్థానం అగ్రహారంవచ్చి, జొన్నాడ కపిలేశ్వరపురం వచ్చి చివరికీ కోటిపల్లిలో తేలాం" అన్న సరస్వతినీ, షూట్ చేస్తున్న గోవింద్‌నీ చూసి కంగారుపడిపోయాడు రామరాజు.

షర్బత్ అమ్ముతున్న నిండుచూలాలైన రామరాజు భార్య రామసీత అక్కడికొచ్చి "ఏంటీ" అంది మొగుడ్ని.

ఇంకా ఏదో అడగడం మొదలుపెట్టింది హుషారైన ఏంకర్ సరస్వతి.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Rangularatnam+Vamsy**

* * *